

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 64 | మంగళవారం 16, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari




## కేరళలో నిఫా వైరస్ కలకలం

- కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ
- మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స
- వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు

తిరువనంతపురం, జూన్ 15 : దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెలిలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి,

2 లో

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

### స్వాగతిస్తూ ఎక్స్ వేదికగా మోడీ ప్రకటన



న్యూఢిల్లీ, జూన్ 15 : అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు. పశ్చిమాసి యాలో

2 లో

## ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

- ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు



వాషింగ్టన్,జూన్15 : పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన

2 లో

## ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా సీఎం చంద్రబాబు

### - గూగుల్, ఎన్‌యూఎస్‌తో కీలక భేటీలు



సింగపూర్, జూన్ 15 : సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు వివిధ సంస్థలతో వరుస భేటీలు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. ఏపీని టెక్నాలజీ, విద్యారంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గూగుల్ క్లౌడ్, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**ఏపీలో ఏఐ, డిజిటల్ విప్లవం... గూగుల్‌తో భాగస్వామ్యం**

ముందుగా గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా అభివృద్ధి చేసే అంశంపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవడంలో సహకరించాలని చంద్రబాబు గూగుల్ క్లౌడ్‌ను కోరారు. గతంలో తాను ప్రవేశపెట్టిన రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీఎస్) వ్యవస్థను ఆధునిక క్లౌడ్ టెక్నాలజీలతో మరింత శక్తివంతం చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని

2 లో

## 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

### – సుమతీ శతకంతో పోలిక!



అమరావతి, జూన్ 15 : దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఢిల్లీలో జనసేన పార్టీ నిర్వహించిన 'సేన ప్రస్థానం-జాతీయ సమైక్యత కోసం' సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న శక్తులను తక్కువ అంచనా వేయకూడదని, అవి బలమైన ప్రభావాన్ని చూపగలవని సుమతీ శతకాన్ని ఉటంకిస్తూ వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతి, నిరుద్యోగం, విద్యావ్యవస్థలోని లోపాలను నిరసిస్తూ యువత సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన ఉద్యమమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఈ పేరుతో పలుచోట్ల నిరసనలు కూడా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "సుమతీ శతకంలో చెప్పినట్లు బలమైన సర్పం కూడా చలిచీమల చేతిలో చిక్కి చనిపోతుంది. ఈ మధ్య కాలంలో పుట్టుకొచ్చిన కాక్రోచ్ పార్టీని చూడగానే నాకు సుమతీ శతకం గుర్తొచ్చింది" అని అన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులు సిద్ధంగా ఉన్నాయని, అటువంటి విభజనవాద ఆలోచనల్లో

2 లో

## అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

### ప్రమాదంలో 12 మంది దుర్మరణం



వాషింగ్టన్,జూన్15 : అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## సతీసమేతంగా రుద్రాభిషేకంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్



హైదరాబాద్, జూన్ 15 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో

2 లో

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



## 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే ఢిల్లీలో సమావేశమయ్యామని పవన్ తెలిపారు. కోట్ల మంది కలిస్తే మంచి లేదా చెడు ఏదైనా బలమైన ప్రభావాన్ని చూపించగలరని పేర్కొన్నారు. విభజనవాదాన్ని సృష్టిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మనం అందులో భాగస్వాములం కాకుండా, ఐక్యంగా ఎదురొడ్డి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా సీఎం చంద్రబాబు

ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో గూగుల్ సహకారంతో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో సాధించిన విజయాలను వివరిస్తూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని గూగుల్‌ను ఆహ్వానించారు. అమరావతిలో సింగపూర్ వర్సిటీ... విద్యారంగంలో ముందడుగు అనంతరం, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్‌తో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిని ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా అమరావతిలో ఎన్‌యూఎస్ అంతర్జాతీయ బ్రాంచ్ లేదా శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు రాజధాని ప్రాంతంలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీలో ప్రపంచ స్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సాంకేతిక, పరిశోధన సహకారాన్ని అందించాలని ఎన్‌యూఎస్‌ను కోరారు.

## ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

## కేరళలో నిఫా వైరస్ కలకలం

కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

## రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారు - కొండపి నియోజకవర్గంలో రెండేళ్లలోనే రూ.532 కోట్ల అభివృద్ధి పనులు - ప్రకాశం జిల్లాను పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దుతాం - రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సుస్థిరకాలం అధికారంలో ఉండాలి - మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి - ప్రకాశం జిల్లా టంగుటూరులో కొండపి నియోజకవర్గ స్థాయి 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం" విజయోత్సవ సభ







ప్రకాశం / టంగుటూరు, (ప్రజా సీమ) జూన్ 15 : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం టంగుటూరులో కొండపి నియోజకవర్గ స్థాయి 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డివిఎస్ బీవీ స్వామి, ఒంగోలు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సభలో మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, దీపం... సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. కొండపి నియోజకవర్గంలో రెండేళ్లలోనే రూ.532 కోట్ల అభివృద్ధి పనులు చేశాం. 2012లో కొండపి రోడ్డు మంజూరు చేయిస్తే ఏడేళ్ల తర్వాత తిరిగి తెదేపా నిర్మించింది. అభివృద్ధికి చిహ్నం తెదేపా, కొండపి నియోజకవర్గంలో పంచాయతీరాజ్, విద్యుత్తుశాఖ, అర్ అండ్ బీ, నీటిపారుదల, వైద్యశాఖ, ఆర్ డబ్ల్యూఎస్, సంగమేశ్వరం తదితర శాఖల పనులకు రూ. 532 కోట్లతో పనులు చేపట్టాం. దేశ వ్యాప్తంగా అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం మాత్రమే. పేదల కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. డీఎస్సీ పోస్టింగులపై కులాలకు ఆపాదించి కులాల మధ్య రెచ్చగొట్టే చేష్టలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యాన్ని గౌరవించే స్వేచ్ఛను ఇస్తే వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో హౌసింగ్ ద్వారా ఇళ్లు నిర్మించుకుంటే ఒక్క రూపాయి ఇవ్వకుండా ఆ నిధులను పక్కదోవ పట్టించారు. అమరావతి నిర్మాతగా చంద్రబాబు పేరు ఉండకూడదన్న కారణంతో వైకాపా పేటీఎం బ్యాచ్ నేటికీ అమరావతిపై విషప్రచారమే చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సుస్థిరకాలం అధికారంలో ఉండాలని ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

## ప్రజల సంతృప్తే లక్ష్యంగా వారి అర్జీలను పరిష్కరించాలి





ఒంగోలు, (ప్రజా సీమ) జూన్ 15 : ప్రజల సంతృప్తే లక్ష్యంగా వారి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ' మీకోసం ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి, డిఆర్ఓ మాధురి, డిపిఓ వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ శాంతిలక్ష్మిలతో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 275 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అర్జీలను సకాలంలో, సహేతుకంగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించలేని పక్షంలో అందుకుగల కారణాలను కూడా ప్రజలకు వివరించాలని చెప్పారు. తరచూ కార్యాలయాలచుట్టూ తిప్పుకోవద్దని, పునరావృతం అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులందరూ తమ లాగ్ ఇన్ లో పెండింగ్ ఉన్న అర్జీలను ప్రతిరోజూ పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ తో పాటు పల్లెనిద్ర, నియోజకవర్గస్థాయి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాల్లో వస్తున్న అర్జీలకు అధిక ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్సీ, ఎస్టీ ప్రజల స్పెషల్ గ్రీవెన్సులో కలెక్టర్ ఆదేశం... 119 అర్జీలు రాక

ఒంగోలు, జూన్ 15 :ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి, డీ.ఆర్.వో. మాధురి,ఆర్.డీ.వో. చంద్ర శేఖర్ నాయుడు, డీ.పీ.వో. వెంకటేశ్వరరావులతో కలిసి ఆయా వర్గాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని ఎస్సీ,ఎస్టీ ప్రజలు కోరిన నేపథ్యంలో ప్రతి నెలా మూడో సోమవారం వీరికోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

## అఖిల భారత వ్యవసాయ-గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షునిగా సిగి చెన్నయ్య



రైల్వే కోడూరు ( ప్రజా సీమ ) ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ-గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర పార్టీ కమిటీ సమావేశం సోమవారం అనగా 15న కాకినాడలో జరిగింది. ఈ సమావేశంలో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర పార్టీ ఉపధ్యాక్షుడిగా సిగి చెన్నయ్యను పార్టీ నిర్ణయించింది. ఆయన సేవలను గుర్తించి, ఈ పదవికి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక
మంగళవారం 16-6-2026 

# రక్తదానానికి యువత ముందుకు రావాలి

## - డిప్యూటీ హెచ్.ఈ.ఓ మహమ్మద్ రఫీ పిలుపు



మదనపల్లె (ప్రజా సీమ) : రక్తదానానికి యువత ముందుకు రావాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. డి.ఎమ్.హెచ్.ఓ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని స్థానిక జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని (జూన్ 14) పురస్కరించుకొని రక్తదానం ఎవరు చేయవచ్చు,రక్తదానం వల్ల లాభలు,అపోహలపై విద్యార్థులుకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము, ఎంతసేపటికి సాటి మనిషి రక్తం దానం చేయాల్సిందే తప్ప వేరే దారి లేదన్నారు.రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బలోపేతం చేయడమే ఈరోజు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన కార్ల్ ల్యాండ్ స్టీనర్ అనే సైన్టిస్ట్ 1901 సంవత్సరంలో రక్తాన్ని వర్గీకరణ చేశారు.అందుకే ఆయన జ్ఞాపకార్థం ఆయన జయంతి రోజైన జూన్ 14ను ప్రపంచం రక్తదాతల దినోత్సవంగా 2004 సంవత్సరము నుండి జరుపుకుంటున్నామన్నారు.ఈ సంవత్సరము యొక్క నినాదం మానవత్వపు ఒక చుక్క రక్తాన్ని దానం చేయండి ప్రాణాలను కాపాడండి – సృష్టిలో రక్తం కేవలం మనిషి నుండి మాత్రమే లభించును,తయారు చేయలేము,రక్తానికి బదులు వేరే ఏదీ లేదు,రక్తం విలువైనదన్నారు.ప్రసవాలు,ప్రమాదాలు,శస్త్ర చికిత్సలు,క్యాన్సర్ వంటి జబ్బులు ఉన్న వారి ప్రాణాలు కాపాడటానికి రక్తాదానం ద్వారానే సాధ్యమన్నారు.ఆరోగ్యవంతులైన 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న వారు,కనీస బరువు 50 కేజీలు ఉన్నవారు అర్హులన్నారు.రక్తాన్ని తీసుకునే వ్యక్తిని గ్రహీత అని ఇచ్చే వ్యక్తిని దాత అని అంటారు.ఓ గ్రూప్ ఉన్న వారు విశ్వ దాత అనీ,ఏ.బి గ్రూప్ ఉన్నవారిని విశ్వ గ్రహీత అనీ అంటారు.ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా చేసే రక్తదానం కీలకం.రక్తదానం చేస్తే బలహీన పడి,అలసిపోతారని అనే అపోహ ఉంది,నిజానికి రక్తదానం తర్వాత ఎలాంటి బలహీనత ఉండదు,నొప్పి ఉండదన్నారు.రక్తదానం శాస్త్రియమైన,సురక్షిత మైన పద్ధతిలో ఏ రకమైన వ్యాధి క్రిములు సోకే అవకాశం లేకుండా జరుగుతుందన్నారు.ఈ సంవత్సరము థిమ్ ప్రతీ ఒక్కరూ రక్తదానం చేద్దాం,భాధితులలో భరోసా నింపుదాం,కలనికట్టుగా భాధితులను కాపాడుకుందామన్నారు.అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ,ప్రిన్సిపాల్ రమాదేవి,ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ దేవేంద్ర నాయక్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతి,సంక్షేమం ఏపీ ఈజీపీఎస్ఎస్ ధ్యేయం

## - రాష్ట్ర అధ్యక్షులు ఆవుల మల్లికార్జున వెల్లడి

## - మదనపల్లెలో జిల్లా ప్రథమ మహాసభ విజయవంతం





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణం,చిత్తూరు బస్టాండ్ సమీపంలోని టౌన్ హాల్ నందు ఆదివారం ఏకలవ్య గిరిజన పరిరక్షణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశం దిగ్విజయంగా ముగిసింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డి.ఎస్.పి వరప్రసాద్,దేవరకొండ శంకరరావు,వీరం సత్యం,నాగేంద్ర సోహనాలు,నాగేంద్ర నాయక్,బ్యాంక్ మేనేజర్ కోనయ్య,ఉపాధ్యాయుడు గోపాల్,చలపతి,కోనేటి రామంచులు,ప్రసాద్,సూర్యప్రకాష్,రమేష్,శేఖర్ రాష్ట్రంలోని ఎరుకుల,యానాది,బంజారా,ఎస్టి కులస్తులు,ప్రముఖ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణ కోసం ఏకలవ్య గిరిజన పరిరక్షణ సేవా సంఘం ముందుంటుందన్నారు.తమ కులాలకు చెందిన కులస్తులు,ఉద్యోగస్తులు,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.అనర్హులకు అందజేసిన ఎస్టీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని,నకిలీ గిరిజన కుల సర్టిఫికెట్లను జారీ చేస్తున్న కుల సంఘాలను రద్దు చేయాలని కోరారు.గిరిజనులకు కేటాయించిన బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమగ్రంగా విచారణ చేసి,పేద దళిత గిరిజనులకు న్యాయం చేయాలన్నారు.రాష్ట్రంలోని ఎస్టీ హాస్టల్లో గిరిజనుల విద్యార్థుల సంరక్షణ విషయమై ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని,రాష్ట్ర బడ్జెట్లో ఐటిడిఏలకు కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు.యానాది కులస్తులను ప్రభుత్వం గుర్తించాలని,వారి ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్టీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించాలని విన్నవించారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎస్టీలకు ఒక ఎమ్మెల్యే స్థానం కేటాయించాలని,ప్రతి జిల్లాలో ఎస్టీ భవన్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో ఏకలవ్య గిరిజన పరిరక్షణ సేవా సంఘం తొలి సమావేశం దిగ్విజయంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు జరుపుకుంటున్న సమస్యలను పరిష్కరించడానికి నిర్విరామ కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశానికి విచ్చేసి జయప్రదం చేసిన గిరిజన ప్రముఖులు,అతిరథ మహారథులు,గిరిజన ముద్దుబిడ్డలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానమన్నారు.

# ప్రజా సమస్యలపై మౌనం ఎందుకు?..

## - వైసీపీ నియోజకవర్గ నేతలపై చర్చ..




పీలేరు, ( ప్రజాసీమ ) :అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్, పార్టీ నాయకుల వ్యవహార శైలిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంతమంది ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పదవులను అడ్డం పెట్టుకుని భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డు సభ్యుల నుంచి ఎంపీపీలు, జడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యుల వరకు కొందరు అక్రమ భూ ఆక్రమణలు, ఇసుక, మట్టి అక్రమ రవాణా ద్వారా కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.అధికారుల సహకారంతో కొందరు బినామీ పేర్లతో పలుమార్లు ఇంటి పట్టాలు పొందడం, వాటిని విక్రయించడం వంటి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో సాధారణ జీవితం గడిపిన కొందరు ప్రస్తుతం విలాసవంతమైన భవనాలు నిర్మించుకుని, ఖరీదైన వాహనాలు కొనుగోలు చేశారని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మాజీ ఎమ్మెల్యే హయాంలో పలువురికి రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు దక్కగా, ఆ పదవుల ద్వారా ప్రయోజనాలు పొందారని కూడా చర్చ సాగుతోంది. ఇలాంటి పరిణామాలే రెండు సంవత్సరాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీలేరు వైసీపీ అభ్యర్థి ఓటమికి కారణమయ్యాయని పార్టీ వర్గాలు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు .మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయని వైసీపీ నాయకులు చెబుతున్నారు. మరోవైపు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటివరకు మూడు మాత్రమే అమలు చేయడం, కొత్త పింఛన్లు, కొత్త ఇంటి పట్టాల పంపిణీ చేపట్టకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రత్యర్థి పార్టీల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం మాజీ ఎమ్మెల్యే, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు మరియు ఇతర వైసీపీ నాయకుల బాధ్యత అని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే ఆగస్టు నెలలో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయడం, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం కోసం నాయకత్వం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది .

# చైతన్యలో పండుగ వాతావరణంలో నక్కింటి మోహన్ జన్మదిన వేడుకలు

## - చిన్నారులు,వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం





మదనపల్లె (ప్రజా సీమ) : గ్రీన్ హార్ట్ సొసైటీ సభ్యులు,మహాన్యూస్ మదనపల్లె ఇంచార్జి,ఎన్.95 యూట్యూబ్ ఛానల్ అధినేత నక్కింటి మోహన్ జన్మదిన వేడుకలు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో అట్టహాసంగా జరిగాయి.ముందుగా చిన్నారులు హర్షధ్వనులతో ఘనస్వాగతం పలికారు.ఇందులో భాగంగా నక్కింటి మోహన్ తన చేతులమీదుగా పదిమంది పిల్లలకు యూనిఫామ్స్,విద్యా సామాగ్రిని అందజేశారు. అదేవిధంగా కేక్ కట్ చేసి పిల్లలతో సరదాగా వారి సమయాన్ని గడిపారు.అంతేకాకుండా పిల్లలందరికీ పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించారు.ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్,సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ.కవితా రాణి నక్కంటి మోహనని శాలువాలతో సన్మానించి సంస్థ జ్ఞాపికను అందజేశారు.అనంతరం నక్కింటి మోహన్ మాట్లాడుతూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.చైతన్య సంస్థ నిర్వాహకుల సేవలు అభినందనీయమని కొనియాడారు.భవిష్యత్తులో చైతన్య సంస్థకు తనవంతు సహాయ,సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. టిడిపి మహిళా నేత జాఫరున్నీషా,టిడిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం నేత బోనాసి జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకుల కన్నీటి ధారను ఆపండి సీఎం సార్

## - వాల్మీకి ఎస్టీ పునరుద్ధరణ హామీని నెరవేర్చాలి

## - వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు డిమాండ్



మదనపల్లె (ప్రజా సీమ) : జూన్ 20వ తేదీన జలధార కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా మదనపల్లికి విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీలోని 50 లక్షల వాల్మీకుల కన్నీటి ధారను ఆపాలని,వాల్మీకులకు ఇచ్చిన హామీ వాల్మీకి ఎస్టి పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక అన్నమయ్య జిల్లా కలెక్టర్ కు వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు,సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకులు ఎలాంటి అభివృద్ధిని నోచుకోక ఆంధ్రప్రదేశ్లో గిరిజన తెగకు చెందిన వాల్మీకి బోయలు విద్యా,ఉద్యోగ,రాజకీయ,ఆర్థిక,సామాజిక,సాంస్కృతిక రంగాలలో నేటికీ అత్యంత వెనుకబాటుతనానికి గురై ఉన్నామని గతంలో అనేక రాష్ట్ర కమిటీలు అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వడం జరిగిందన్నారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో వాల్మీకి/బోయల ఎస్టీ పునరుద్ధరణ బాధ్యత తనదేనని వాల్మీకి బోయలకు హామీ ఇవ్వడం జరిగిందని,కానీ నేటికీ హామీని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల వాల్మీకి బోయలు అన్ని రంగాలలో వెనుకబాటుతనానికి గురై 50 లక్షల వాల్మీకుల కన్నీరు నేడు ధారలుగా ప్రవహిస్తున్నదని చంద్రబాబు నాయుడు వాల్మీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చి వాల్మీకుల కన్నీటి ధారను ఆపాలని డిమాండ్ చేశారు.అలాగే మదనపల్లిలో చిత్తూరు బస్టాండ్ ప్రక్కన ఉన్న వాల్మీకి కూడలిని అధికారికంగా వాల్మీకి కూడలిప్రకటించాలని దశాబ్దాల వాల్మీకుల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు సభ్యుల సద్దల జయసింహా,రాష్ట్ర సలహాదారుడు కొత్తవుడుం శేఖర,అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు అనురాధ,మదనపల్లి టౌన్ యువత అధ్యక్షుడు ముక్కండ్ల జగదీష్,గౌతమీ నగర్ అధ్యక్షురాలు అరవ నిర్మలమ్మ,పారపట్ల నరసింహులు,బొంత రామకృష్ణ,గాయత్రి,రేణుక,హృదయ,మైథిలి తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల భద్రతకు పోలీస్ శాఖ భరోసా

## - ఎస్పీ ఆదేశాలతో స్కూల్ ఆటోలపై స్పెషల్ డ్రైవ్



మదనపల్లె (ప్రజా సీమ) : పాఠశాల విద్యార్థుల భద్రతే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఇందులో భాగంగా సోమవారం రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో తిరుగుతున్న స్కూల్ ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో ఆటో డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు,వాహనాలకు సంబంధించిన ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్స్ వంటి కీలక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీసులు డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆశకు పోయి పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో ఎక్కించి వారి ప్రాణాలతో చెలగాటమాడొద్దని తీవ్రంగా హెచ్చరించారు. ఆటో నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలతో పాటు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అదేవిధంగా జిల్లా కేంద్రమైన మదనపల్లె,ఇతర ప్రాంతాలలో పాఠశాలల ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

# సీఎంగారు మదనపల్లె సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించండి

## - సీపీఐ నాయకులు కృష్ణప్ప,సాంబశివ,మురళి డిమాండ్
## - జూన్ 20న సీఎం పర్యటనలో ప్రకటించాలని విజ్ఞప్తి




మదనపల్లె (ప్రజా సీమ) : జూన్ 20న జలధార భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మదనపల్లికి విచ్చేస్తున్న సందర్భంగా మదనపల్లి నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ,మురళి డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లి ప్రాంతంలో త్రాగునీరు,సాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే హంద్రీ-నీవా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించి చెరువులను నింపే కార్యాచరణను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.ప్రతి గ్రామానికి తాగునీరు,ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలతో మదనపల్లి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వెంటనే మదనపల్లి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని,మదనపల్లి-రామసముద్రం రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించాలని కోరారు.వ్యవసాయాధారిత ప్రాంతమైన మదనపల్లిలో టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర,యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అలాగే నూతన ప్రభుత్వ పరిశ్రమల ఏర్పాటు చేసి ప్రాంతీయ అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,ఆరోగ్యం,విద్య,రోడ్లు,తాగునీరు,ఉపాధి వంటి ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి పర్యటన కేవలం భూమి పూజ భహిరంగ సభకే పరిమితం కాకుండా,మదనపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి స్పష్టమైన హామీలు,నిధుల కేటాయింపులు ప్రకటించాలి.ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించి అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపీఐ నాయకులు ఓబులేసు,విజయ్ పాల్గొన్నారు.

# మైసూరు వారి పల్లి పంచాయతీలోని విలువైన భూములను కాపాడండండి..!

## - ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన కూని నాగరాజు.

రైల్వే కోడూరు ( ప్రజా సీమ): రైల్వే కోడూరు మండలం మైసూరు వారి పల్లి కి చెందిన రైల్వే కోడూరు నియోజకవర్గ దళిత నాయకులు కూని నాగరాజు సోమవారం ప్రజా పరిష్కారాల వేదిక కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విలువైన భూములు ఆక్రమించుకోవడంతో వినతి పత్రం ఇచ్చానని తెలిపారు . ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ మైసూరు వారి పల్లి గ్రామ పంచాయతీ కి సంబంధించిన ప్రభుత్వ భూములలో ఎవరికి వారు ఆక్రమించుకుంటున్నా, అనేక పర్యాయాలు తహసిల్దార్ కు ,వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించామని తెలిపారు. సర్వేనెంబర్ 2084, 2085, 2086, 17 ఎకరాల 36 సెంట్లు ఆక్రమించుకున్నారని దీని విలువ దాదాపు 50 కోట్ల రూపాయలు విలువ చేస్తుందని తెలిపారు. పెన్సింగ్ చేస్తూ సిమెంటు సిమెంట్ దిమ్మెలు నాటారని తెలిపారు. వీరి కొంతమంది రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన నూతనముగా ప్రవేశపెట్టిన చట్టంతో ప్రభుత్వభూములు ఆక్రమించుకున్న వారిపై 14 సంవత్సరాల శిక్ష పడే విధంగా కేసులు నమోదు చేస్తే తప్ప రైల్వే కోడూరు మండలంలో భూకబ్జాలు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. గతవైసీపీ



ప్రభుత్వంలో ఈ భూమిని పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రతిపాదన చేసింది అన్నారు. ఈ ప్రభుత్వంలో చెరువు లు,వాగులు, ప్రభుత్వ భూములు, అనేకచోట్ల ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాలు జరుగుతున్నాయో ఆ గ్రామ రెవెన్యూ అధికారిని, సహాయకులను, బాధ్యులు చేసి ఉద్యోగంలోని తొలగించే విధంగానైనా చట్టం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నుండి వేలకు వేలు జీతాలు తీసుకొని కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు . ఇకనైనా రెవెన్యూ అధికారులు మైసూర్ వారి పల్లి పంచాయతీ చెందిన విలువైన భూములను కబ్జాల చేసుకున్న వారి నుండి కాపాడి పేదలకు ఈ స్థలాలను మూడు సెంట్లు చొప్పున గృహ నిర్మాణాలకు ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, వెంకటేసు, నారాయణ,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

## - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ వెల్లడి



మదనపల్లె (ప్రజా సీమ) : పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో జేసీతోపాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి,ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి,డిడిఓ లక్ష్మీపతి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు,బియాండ్ ఎస్ఎల్ఏ,రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.చౌడేపల్లి మండలానికి చెందిన కరమల లలిత తన భర్త 2025 నవంబరులో మృతి చెందారని,తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 341 అర్జీలు రాగా వాటిపై తగు చర్యలు తీసుకొని పరిష్కరించే నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులపై వేధింపులు,దాడులను నివారించాలి

## - సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ డిమాండ్





మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె సిటీలో ఈరోజు ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకునే సోమవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ,కార్యదర్శి కరుణాకర్,కోశాధికారి కుమార స్వామి,మహిళా ప్రతినిధి సరస్వతి,ఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ, జగన్మోహన్ ఆధ్వర్యంలో జి.ఆర్.టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహించారు.వయోవృద్ధుల పై వేధింపులు,దాడులు,భౌతిక దాడులు,శారీరక వేధింపులు,మానసిక వేధింపులు,ఆర్థిక వేధింపులు నిర్లక్ష్యము చేయడం పద్ధతి ప్రకారం వేధించడం మొదలగు వాటికి వ్యతిరేకంగా అవగాహన కల్పించారు.సీనియర్ సిటిజన్స్ ద్వారా ర్యాలీ నిర్వహించి వయోవృద్ధులపై వేధింపులు నివారించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ మునుగోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతిరోజు వయోవృద్ధులపై ఏదో ఒక ప్రాంతంలో వయోవృద్ధులపై భౌతిక దాడులు,పద్ధతి ప్రకారం జరుగుతున్నాయని,కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో తాత్కాలికంగా రైల్వే రాయితీని వయో వృద్ధులకు రద్దు చేశారని,వయోవృద్ధులకు రైల్వే రాయితీని పునరుద్ధరించాలని జాతీయస్థాయిలో ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ ద్వారాను ఆంధ్ర రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే రాయితీని వయో వృద్ధులకు తిరిగి కల్పించాలని దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేశామన్నారు.ఈ రైల్వే రాయితీ కల్పించకపోవడం కూడా వయో వృద్ధులను ఆవేదనకు గురిచేసి వయో వృద్ధులను వేధింపులకు గురిచేసిందన్నారు.ఈ కార్యక్రమంలో శకుంతలమ్మ,సరస్వతి,ధనలక్ష్మి రిటైర్డ్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్,డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు,ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ చంద్రశేఖర్,మహానటుడు నాగభూషణం,దివాకర్,జాయింట్ సెక్రెటరీ వి.ఎం నాగరాజ,నవలా రచయిత టిఎస్ఏ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# వాల్మీకి విగ్రహం సమీపంలో మరో విగ్రహం ఏర్పాటు సబబు కాదు

## - అనువైన చోట చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
## - రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు డిమాండ్

మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా,మదనపల్లె పట్టణంలోని చిత్తూరు బస్టాండ్ సమీపంలో ఉన్న వాల్మీకి సర్కిల్ వద్ద బాహుదా కాలువలో ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మరొక అనువైన ప్రాంతానికి రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం పిజిఆర్ఎస్ నందు జిల్లా కలెక్టరుకి ఆయన ఫిర్యాదు చేశాడు.ఈ సందర్భంగా పూలకుంట్ల హరిబాబు మాట్లాడుతూ మదనపల్లె పట్టణం చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని,బ్రిటీష్ కాలం నుంచే పట్టణం గుండా ప్రవహిస్తున్న బాహుదా కాలువ గట్టుపై వాల్మీకిబోయ సమాజం ఆరాధ్యదైవమైన, ఆదికవి శ్రీశ్రీశ్రీ మహర్షి వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయబడిందన్నారు.అనంతరం ముంబై-చెన్నై జాతీయ రహదారి విస్తరణ జరిగినప్పటికీ,ఆ ప్రాంతం నేటికీ వాల్మీకి కూడలిగానే ప్రసిద్ధి చెందిందన్నారు. 1996 జూన్ 14న బాహుదా కాలువకు సంభవించిన తీవ్ర వరదల కారణంగా మదనపల్లె పట్టణం భారీగా ప్రభావితమై,ఆస్తి మరియు ప్రాణనష్టం కూడా సంభవించిన విషయం విదితమే.అటువంటి ప్రధాన వరద ప్రవాహ మార్గమైన బాహుదా కాలువలో ప్రస్తుతం మున్సిపల్ అనుమతులతో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు.మేము ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేకులు కాదని స్పష్టంగా తెలియజేస్తున్నామని,వారి చారిత్రక సేవలను గౌరవిస్తూ,విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తున్నామని అయితే,ప్రధాన కాలువలో విగ్రహ నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తులో వరదల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ప్రజలకు ప్రమాదకర



పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు.ఈ అంశంపై రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్,వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి మరియు వాల్మీకిబోయ కుల సంఘాలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయని,బాహుదా కాలువలో జరుగుతున్న నిర్మాణానికి సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల నుండి అవసరమైన అనుమతులు పొందిన విషయంపై కూడా ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కావున బాహుదా కాలువలో ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని అనువైన మరొక ప్రాంతానికి తరలించాలని,చారిత్రక గుర్తింపుగా ఉన్న వాల్మీకి సర్కిల్ పేరును యథాతథంగా కొనసాగించాలని,వాల్మీకి సర్కిల్‌ను మరింత ఆధునీకరించి అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దత్తా ఇన్‌స్టిట్యూట్ తో మిట్స్ యూనివర్శిటీ అవగాహన ఒప్పందం

## - వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ వెల్లడి




మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం వారు మరియు బెంగళూరుకు చెందిన దత్తా ఇన్‌స్టిట్యూట్ల మధ్య విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి,పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ మరియు ఉపాధి అవకాశాల లక్ష్యంగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దత్తా ఇన్‌స్టిట్యూట్ హెడ్ - ఆపరేషన్స్ అభిలాష్ బెల్లం,లీడ్ లెర్నింగ్ పార్టనర్ నాగ చరణ్ కొణిదెల,లక్ష్మీధర్ మరియు డీన్- స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ డాక్టర్ భాను శ్రీ రెడ్డిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తూ,విద్యార్థులను భవిష్యత్ ఉద్యోగ విపణి అవసరాలకు సిద్ధం చేయడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలవనుందన్నారు.ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ),డేటా సైన్స్,డిజిటల్ టెక్నాలజీలు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ప్రత్యేక శిక్షణ,వర్క్‌షాపులు,సర్టిఫికేషన్ కోర్సులు,పరిశ్రమ నిపుణుల ఉపన్యాసాలు మరియు అభ్యాన అవకాశాలు కల్పించనున్నారు.అలాగే ఇంటర్న్‌షిప్‌లు,ఉద్యోగార్హత పెంపు కార్యక్రమాలు,కెరీర్ మార్గదర్శకత్వం,పరిశ్రమలతో ప్రత్యక్ష అనుసంధానం మరియు ప్లేస్‌మెంట్ సహాయాన్ని అందించడం ద్వారా విద్యార్థుల వృత్తిపరమైన సామర్థ్యాలను మరింత మెరుగుపరచనున్నారు.విద్యా సంస్థలు మరియు పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తూ విద్యార్థులను భవిష్యత్‌కు సిద్ధమైన నైపుణ్యవంతులుగా,పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులుగా తీర్చిదిద్దడంలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,డీన్- స్కూల్ అఫ్ మేనేజిమెంట్ డాక్టర్ భాను శ్రీ రెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్-ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ పి.ఎమ్ బాలాజీ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టిన బహుజన యువసేన

## - సి.టి.యం రోడ్డులో మొక్కల నాటిన బీవైఎస్ బృందం



మదనపల్లె (ప్రజా సీమ) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మదనపల్లి పట్టణంలోని సి.టి.యం రోడ్డులో బహుజన యువసేన (బీవైఎస్) సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులందరూ కలిసి రోడ్డు ఇరువైపులా మరియు ఖాళీ స్థలాలలో పలు రకాల మొక్కలను నాటారు.?ఈ సందర్భంగా బహుజన యువసేన (బీవైఎస్) రాష్ట్రపట్టణ అధ్యక్షుడు పునీత్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలంలో కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్న సమాజాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.కేవలం మొక్కలు నాటడమే కాకుండా,వాటిని సంరక్షించి వృక్షాలుగా మార్చడమే మన ప్రథమ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి ఇటువంటి సామాజిక కార్యక్రమాలు ఎంతో అవసరమని,రాబోయే రోజుల్లో బీవైఎస్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పునీత్ కుమార్ స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో బహుజన యువసేన ముఖ్య నాయకులు,యువకులు మరియు స్థానికులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలకు నీళ్లు పోసి,వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.

# శ్రీ మానసా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు





సిద్ధవటం( ప్రజా సీమ) కడప చెన్నై జాతీయ రహదారిలోని శ్రీ మానసా దేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కనుమల్లోపల్లి సమీపాన వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో అమావాస్య సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ పూజారి శర్మ మాట్లాడుతూ అమ్మవారికి పంచామృత అభిషేకము విశేషమైన పూజలు నిర్వహించి ప్రత్యేక ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని ఆలయ పూజారి తెలిపారు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య, భక్తులు పాల్గొన్నారు

# ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటరమణా రెడ్డి

## - శుభాకాంక్షలు తెలిపిన పలువురు సర్వే ఉద్యోగులు



మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పలమనేరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐఓఎస్) వై.వెంకట రమణా రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జూన్ 13,14 తేదీల్లో విజయవాడ నగరంలో సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభలు,నూతన కార్యవర్గ ఎన్నికలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి,వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తూ అందరి మన్ననలు పొందిన వెంకట రమణారెడ్డిని రాష్ట్ర అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సర్వే విభాగంలో ఆయన అందిస్తున్న సేవలు,ఉద్యోగ సంఘాల్లో ఆయనకున్న పట్టును గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన,ప్రస్తుతం మదనపల్లె డివిజన్ పరిధిలోని పలమనేరులో డిప్యూటీ ఇన్స్పెక్టరుగా విధులు నిర్వహిస్తున్న వెంకట రమణారెడ్డి రాష్ట్రస్థాయి అత్యున్నత పదవికి ఎన్నిక కావడం పట్ల మదనపల్లె,పలమనేరు ప్రాంతాల్లోని పలువురు సర్వే అధికారులు,రెవెన్యూ సిబ్బంది,ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సర్వే ఉద్యోగులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సర్వే సిబ్బంది ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యల పరిష్కారానికి,వారి సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తానని,ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందేలా తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.వెంకట రమణా రెడ్డి ఎన్నికపై పలువురు తోటి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఫోన్ ద్వారా,సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు చూపాలి

## - పీజీఆర్ఎస్ అర్జీలపై అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలి -- రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి
## - పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేయాలి
## - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, (ప్రజా సీమ)జూన్ 15 : ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించడంతో పాటు, తీసుకోబోయే చర్యలపై కూడా అర్జీదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలని సూచించారు. కారుణ్య నియామకాలకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని కారుణ్య నియామకాల కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, వాటిని 15 రోజుల్లోగా పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా పారదర్శకంగా, సమయపాలనతో వ్యవహరించాలని, పెండింగ్ కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలి: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొన్ని శాఖలుఇంకా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించ లేదని పేర్కొంటూ, సంబంధితశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, జిల్లాను రాష్ట్రంలో మంచి గణాంకాలు పొందే విధంగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా పాత్రికేయుడు నక్కింటి మోహన్ పుట్టినరోజు వేడుకలు

## - ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా
## - సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అమోఘమని ప్రశంసలు



మదనపల్లె (ప్రజా సీమ) : మహాన్యూస్ మదనపల్లి ఇంచార్జ్,ఎన్.95 యూట్యూబ్ ఛానల్ అధినేత,గ్రీన్ హార్ట్ సొసైటీ సభ్యుడు నక్కింటి మోహన్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా తన నివాసంలో పూలమాల, శాలువాతో సన్మానించి నక్కింటి మోహనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో సుదీర్ఘ అనుభవం కలిగి అందరి మన్ననలు అందుకున్న వ్యక్తి మోహన్ అని ప్రశంసించారు.సమాజ శ్రేయస్సులో పాత్రికేయుల పాత్ర అమోఘమని,ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారంలో వారు ముందుంటారన్నారు.తనకు వ్యక్తిగతంగా మోహన్ అత్యంత సన్నిహితుడని,తన రాజకీయ ఎదుగుదలకు ఆయన సలహాలు ఎంతో దోహదపడ్డాయన్నారు.తన కలం ద్వారా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తున్న నక్కింటి మోహన్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,పాత్రికేయ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జహా సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని,ఆయన చూపుతున్న అభిమానానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.పాత్రికేయ వృత్తిలో తనకు అన్నివిధాలా సహకరిస్తున్న సహచర పాత్రికేయులు,శ్రేయోభిలాషులు,గ్రీన్ హార్ట్ సొసైటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నవీన్ చౌదరి,బోనాసి జాన్ బాబు, జి.వి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యభాగ్యానికి నిత్య యోగానే ఉత్తమ మార్గం : కలెక్టర్







కొత్తపట్నం, జూన్ 15(ప్రజా సీమ) : ఆరోగ్యభాగ్యానికి నిత్య యోగానే ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుండే యోగా సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో జరుగుతున్న యోగ సాధనలో భాగంగా సోమవారం కొత్తపట్నం మండలం పల్లెపాలెం బీచ్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ.నూకసాని బాలాజీ, సంతనూతలపాడు శాసనసభ్యులు శ్రీ.బి.ఎన్. విజయ్ కుమార్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ శ్రీ.కామే పల్లి సీతారామయ్యలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ పంచ భూతాల సంగమ ప్రాంతంలో ఉత్సాహంగా వారు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనదేశంలో పుట్టి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన గొప్ప కళ యోగా అన్నారు. ప్రజలందరి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం 'యోగాంధ్ర' కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతమైన పల్లెపాలెం బీచ్‌లో యోగా కార్యక్రమం నిర్వహించడం పర్యాటకానికి, ఆరోగ్యానికి రెండింటికీ మంచిదని అభిప్రాయపడ్డారు.అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాల యాల్లో యోగా సాధన అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య, సంతోష, సంపన్నవంతమైన రాష్ట్ర ఆవిష్కరణ కోసం ముఖ్యమంత్రి శ్రీ.నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ యోగా సాధన చేయాలన్నారు. సీతారామయ్య మాట్లాడుతూ జీవనశైలిని మార్చుకోవటం ద్వారా దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. దీనికి యోగా సాధన అత్యుత్తమమని చెప్పారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా... కందుకూరులో ప్రత్యేక 'పోలీస్ మీకోసం' కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

**- ప్రజలకు మరింత చేరువవుతున్న పోలీస్ సేవలు... ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి ప్రత్యేక వేదిక**






ఒంగోలు, (ప్రజా సీమ) జూన్ 15 : ప్రజా ఫిర్యా దులను సత్వరమే పరిష్కారించా లని మరియు ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో జిల్లా ఎస్పీ మరియు పోలీస్ అధికారులు సోమవారం కందుకూరు డిఎస్పీ కార్యాలయ ఆవరణలోని 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కందు కూరు మరియు ఇతర ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, వారి సమ స్యల పూర్తి వివరాలను తెలుసు కున్నారు. వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాఫిర్యాదుల పట్ల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కావున ఆ పిర్యాదులపై తీసుకున్న చర్యలపై కూడా నివేదిక అందించాలన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., గారు మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు పోలీస్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో ప్రత్యేక పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కందుకూరు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలు పడి ఒంగోలులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రతి సోమవారం ఆల్టర్నేట్ గా ప్రకాశం,మార్కాపురం జిల్లాలో ఒక్కొక్క సబ్ డివిజన్ లో కూడా ప్రత్యేక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వాటిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమంలో కుటుంబ కలహాలు, చీటింగ్, భర్త/అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు మరియు ఇతర సమస్యలపై పిర్యాదులు అందాయి. అదే విధంగా ఈ రోజు ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీధర్ గార్లు నిర్వహించిన మీకోసం కార్యక్రమంకు 62 ఫిర్యాదులు అందినాయి. ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్పీ బాలసుబ్రహ్మణ్యం , ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, కందుకూరు సీఐ అన్వర్ బాషా, గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ఒంగోలు రూరల్ శేషగిరి రావు, దర్శి సీఐ రామారావు, కొండేపి సీఐ రమణయ్య, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పీ జీ ఆర్ ఎస్ కు 238 అర్జీలు



మార్కాపురం, (ప్రజా సీమ) జూన్ 15 : మార్కాపురం కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీ జీ ఆర్ ఎస్ )కార్యక్రమానికి 238 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ కు సంబంధించి 159, ఇతర సమస్యలపై 79 అర్జీలు వచ్చాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కార్యక్రమాల్లో రెవెన్యూ సంస్థలపైనే ఎక్కువ అర్జీలు వస్తున్నాయని వీటి పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం మంచి పద్ధతి కాదన్నారు. సాధ్యమైనంతవరకు పరిష్కారమయ్యే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీదారులను పదేపదే తిప్పుకోవడం ఏ మాత్రం మంచి పద్ధతి కాదన్నారు. ఇకనుంచి పద్ధతి మార్చుకొని రెవెన్యూ వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, కనిగిరి ఆర్ డి ఓ అజయ్ కుమార్, కంభం ఎస్ డి సి సత్యనారాయణ, హౌసింగ్ పీడీ మోహన్ రావు, జిల్లా మైనింగ్ అధికారి రవిప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి రాంబాబు, ఐసిడిఎస్ ఇంచార్జి పీడి పద్మావతి, జిల్లా వ్యవసాయ శాఖ ఇన్చార్జి అధికారి బాలాజీ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రానున్న 5 రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం : కలెక్టర్



ఏలూరు, (ప్రజా సీమ) జూన్ 15 : ఏలూరు జిల్లాలోని అన్ని మండలాలలో రానున్న 5 రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఉష్ణోగ్రతలు 42 నుండి 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంటుందని, తీవ్రమైన ఎండలు... వేడిగాలులు వీచే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటలకు అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రావద్దని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**




మచిలీపట్నం, (ప్రజా సీమ)జూన్ 15 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ప్రజల నుంచి అందిన అర్జీలను సకాలంలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ఇంచార్జ్ డిఆర్ఓ పి పోతురాజు, డీఎస్పీ జి. శ్రీనివాసరావుతో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి వినతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టి అర్జిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

**అర్జీలలో కొన్ని:** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంలు, స్టేషనరీ వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని, ఈ వ్యవహారంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కృష్ణా జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించింది. అలాగే జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్నెస్ను తనిఖీ చేయాలని, సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించడం, ఫిట్నెస్ లేని బస్సులు నడపడం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు బి. పూజిత, జిల్లా కార్యదర్శి ఎస్. సమరం తదితరులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రాలు అందజేశారు.ప్రభుత్వం 2005లో తన పేరున మంజూరు చేసిన డి-పట్టా ఇంటి స్థలంలో నిర్మించిన ఇంటిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తన భర్త దుర్వ్యసనాలకు అలవాటు పడి ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తూ కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన వేముల తిరుపతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తన పేరున ఉన్న డి-పట్టా నివేశన స్థలానికి సంబంధించిన ఇంటిపన్ను తన పేరుకు మార్చి, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ను కోరారు.రంగన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని శింగన్నగూడెం, రంగన్నగూడెం చెరువులను మూడు సంవత్సరాల కాలానికి పబ్లిక్ టెండర్ ద్వారా పాటపాడుకున్నట్లు బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన బొకినాల సాంబశివరావు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. చెరువుల లీజుకు సంబంధించి గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు నగదు చెల్లించినప్పటికీ ఇప్పటి వరకు రశీదులు ఇవ్వలేదని తెలిపారు. లీజు కాలం డిసెంబర్ 2026 వరకు ఉండగా, కొంతమంది అధికారులు తనకు ఇబ్బందులు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులో సుమారు రూ.10 లక్షల విలువైన చేపలు ఉన్నందున తనకు ఎలాంటి నష్టం జరగకుండా రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, డిపిఓ ధనలక్ష్మి, పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ రమణరావు, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, డ్వామా, డీఆర్డిఏ పీడీలు ఎన్ శివప్రసాద్ యాదవ్, హరిహరనాథ్, ఎల్డిఎం రవీంద్రారెడ్డి, మత్స్య, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు అయ్యా నాగరాజా, జ్యోతి రమణి, జే జ్యోతి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

**- రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాల పంపిణీ - ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలి - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





నంద్యాల, (ప్రజా సీమ) జూన్ 15 : సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు స్వయం సమృద్ధితో జీవించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడీఐపీ (ూణ×ా) పథకం కింద దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరితో కలిసి కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు వీల్చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, వృద్ధులకు చేతికర్రలు తదితర సహాయక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సుమారు 5 వేల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వివిధ సహాయక పరికరాల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు చేరవేసి వారికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు అంశంపై స్పందిస్తూ, 90 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగి పూర్తిగా ఇతరులపై ఆధారపడే వ్యక్తులకు ప్రత్యేక నిబంధనల మేరకు అధిక పెన్షన్ అందజేస్తున్నట్లు వివరించారు. అర్హుల వివరాలను వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.16 కోట్ల నిధులు కేటాయించిందని, మరింత మంది లబ్ధిదారులకు మద్దతు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 24,679 మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.15.26 కోట్ల మేర పెన్షన్లు అందుతున్నాయని, అదనంగా డయాలసిస్ మరియు మంచానికే పరిమితమైన పక్షవాతం బాధితులకు ప్రత్యేకంగా రూ.1.53 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దివ్యాంగులకు సామాజిక భద్రతతో పాటు రవాణా సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం తరహాలోనే దివ్యాంగ శక్తి కార్యక్రమం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలి. జిల్లాలో ఇప్పటివరకు 1.42 లక్షల మంది దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకుని రూ.58.64 లక్షల విలువైన ప్రయాణ సౌకర్యం పొందినట్లు వెల్లడించారు. హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డ్ కార్యాలయాల్లో మాత్రమే ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని, సాధారణ వినతిపత్రాలు సమర్పించడం ద్వారా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఆన్లైన్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు, సంబంధిత విభాగాలు పరిశీలించిన అనంతరం తుది అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలింకో సంస్థ కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ కొనియాడారు. గత మూడు వారాలుగా సంస్థకు చెందిన సిబ్బంది జిల్లాలోనే ఉండి లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా పరికరాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలింకో ద్వారా గుర్తించిన 1,847 మంది దివ్యాంగులకు దాదాపు రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాలను అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులలో ఉన్న ఆత్మవిశ్వాసం, పట్టుదల సమాజానికి ఆదర్శమని, వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తున్న తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తగిన స్థలం గుర్తించి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, స్థలాల కబ్జా, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని హామీ ఇచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## పెద్ది విన్నింగ్ షాట్ కొట్టాడు కానీ..



ఈ రోజుల్లో హిట్ టాక్ తెచ్చుకున్న సినిమాలకు తొలి వీకెండ్ తర్వాత వసూళ్లు బాగా పడిపోతున్నాయి. ఒకసారి పడ్డాక, వసూళ్లు పుంజుకోవడం కష్టమవుతోంది. అలాంటిది డివైడ్ టాక్‌తో మొదలైన 'పెద్ది' సినిమా రెండో వీకెండ్లో పుంజుకున్న తీరు అనూహ్యమే. చాన్నాళ్ల తర్వాత వచ్చిన పెద్ద హీరో సినిమా కావడం.. కమర్షియల్ హంగులకు తోడు కథాబలం కూడా ఉన్న సినిమా కావడం.. టికెట్ల ధరలు కూడా తగ్గించడం.. జనాలు థియేటర్లకు రావడానికి తోడ్పడింది. నిన్న ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ 'పెద్ది'కి చాలా థియేటర్లలో హౌస్ ఫుల్స్ పడ్డాయి. సింగిల్ స్క్రీన్ల ముందు రెండో వీకెండ్లో హౌస్ ఫుల్ బోర్డులు పెట్టడం అంటే ఈ రోజుల్లో అరుదైన విషయమే. వీక్ డేస్‌లో సినిమా వీక్ అవడం చూసి తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు బ్రేక్ ఈవెన్ అవుతుందా.. బయ్యర్లు సేఫ్ అవుతారా లేదా అన్న సందేహాలు కలిగాయి. కానీ మ్యాచ్ చివర్లో విన్నింగ్ షాట్ కొట్టినట్లే.. పెద్ది థియేట్రికల్ రన్ చివర్లో భలేగా పెర్ఫామ్ చేసింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా అన్ని ఏరియాల్లో 'పెద్ది' సినిమా సేఫ్ జోన్లోకి వచ్చేసింది. ఐతే పెద్ది విన్నింగ్ షాట్ ఏపీ, తెలంగాణకే పరిమితం. ఇంకెక్కడా ఈ సినిమా బ్రేక్ ఈవెన్ అవ్వలేదు. కర్ణాటకలో బాగా ఆడినప్పటికీ.. పెట్టుబడి భారీ మొత్తంలో పెట్టడంతో అక్కడ సినిమా నష్టాలే మిగిల్చింది. తమిళనాడు, కేరళలో 'పెద్ది' ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. హిందీలో ఓమాదిరిగా ఆడుతోంది కానీ.. అది సరిపోదు.

ఈ చిత్రాన్ని హిందీలో జియో స్టూడియోస్ గట్టిగా ప్రమోట్ చేసి రిలీజ్ చేసింది కానీ.. ఆశించిన ఫలితం అయితే రాలేదు. పెట్టుబడిలో చాలా వరకు నష్టపోయినట్లే. ఇక 'పెద్ది' సినిమాకు అతి పెద్ద షాక్ అంటే యుఎస్‌లోనే. రూ.40 కోట్లకు పైగా పెట్టి హక్కులు తీసుకున్న ప్రత్యంగర సినిమాస్ సగానికి సగం నష్టపోయినట్లు తెలుస్తోంది. 6.5 మిలియన్ డాలర్లు రాబట్టాల్సిన సినిమా కాస్తా 4 మిలియన్ల మార్కును కూడా దాటడం కష్టంగా ఉంది. మొత్తంగా చూస్తే 'పెద్ది'ని పక్కా లోకల్ హిట్‌గా చెప్పొచ్చు. తెలుగు రాష్ట్రాల అవతల మాత్రం సినిమా డిజాస్టరే.

## హై-ప్రొఫైల్ స్కామ్ థ్రిల్లర్ రిటర్న్స్!



కొన్ని సినిమాలు ఎంత అద్భుతంగా రూపొందినా? అనివార్య కారణాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ఏళ్ల తరబడి సమయం పడుతుంది. ఆ కోవకు చెందిన చిత్రమే -శతురంగ వేట్టై 2-. అరవింద్ స్వామి-త్రిష జంటగా నిర్మల్ కుమార్ తెరకెక్కించిన చిత్రమిది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు.. ఇతర అడ్డంకులను దాటుకుంటూ ఎట్టకేలకు చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా వెనుక ఉన్న అతిపెద్ద విషాదం .. భావోద్వేగ ప్రయాణం దివంగత నటుడు, నిర్మాత మనోబాలది. ఈ ప్రాజెక్ట్‌ను ఆయన ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి తలపెట్టారు. సినిమా ఎలాగైనా థియేటర్ల వరకు తీసుకురావడానికి చివరి శ్వాస వరకు శ్రమించారు. చిత్రం ఆలస్యం అవుతున్న కొద్దీ మానసిక వేదనకు, ఒత్తిడికి గురయ్యారు. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఆయన తపన.. ఆ క్రమంలో ఎదురైన అడ్డంకులు ఆయనపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు సంబంధించి లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను పరిష్క రించేందుకు చిత్రబృందం ప్రముఖ ఫైనాన్షియర్ మదురై అన్బుచెలియన్‌ను సంప్రదించింది. దీనిపై స్పందించిన ఆయన మానవీయ కోణంలో ఎలాంటి ముందస్తు డబ్బు ఆశించకుండా సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సినిమా థియేటర్ లోకి రావడం... కలెక్షన్లు రావడం ప్రారంభమయ్యాక తన వాటాను నెమ్మదిగా సెటిల్ చేసుకోవచ్చని చెప్పి పెద్ద మనసును చాటుకున్నారు. ఈ చిత్రంలో అరవింద్ స్వామి, త్రిషల కాంబినేషన్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. -తని ఒరువన్- చిత్రంతో విలక్షణ నటనతో సరికొత్త ఇన్నింగ్స్ ప్రారంభించిన అరవింద్ స్వామి.. ఇప్పటికీ క్రేజీ ప్రాజెక్ట్స్‌తో రాణిస్తున్న క్వీన్ త్రిషల స్క్రీన్ ప్రెజెన్స్ ఈ మైండ్ గేమ్ థ్రిల్లర్‌కు పీక్ రేంజ్ హైప్ తీసుకొస్తోంది. మొదటి భాగం తరహాలోనే సమాజంలో జరిగే ఆధునిక మోసాలు, హై-ప్రొఫైల్ స్కామ్‌ల చుట్టూ తిరిగే కథలో ఇద్దరి స్క్రీన్ కెమిస్ట్రీ .. నటన ఎలా ఉండబోతోందా? అని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రానికి ఎన్వీ నిర్మల్ కుమార్ దర్శకత్వం వహించగా పవర్‌ఫుల్ అండ్ ఇంటెలిజెంట్ సినిమాల దర్శకుడు హెచ్. వినోద్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. వినోద్ రాసిన పదునైన సంభాషణలు, మైండ్ బ్లోయింగ్ కన్-డ్రామాలు థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## వ్వాటే పంచ్: సమంత చేసిన పూరీలు ఎలా ఉంటాయో చెప్పిన భర్త!



దశాబ్దాల పాటు తనదైన ప్రత్యేకమైన యాంకరింగ్ శైలితో.. అద్భుతమైన టైమింగ్‌తో సీనియర్ యాంకర్ సుమ కనకాల తెలుగు ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. బుల్లితెరపై ఈ సీనియర్ యాంకర్ సందడి ఎప్పటికీ అల్టిమేట్. ఇప్పుడు సుమ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న -సుమ అండ్ చాట్ షో- సరికొత్త ఇంటర్వ్యూలతో మరోసారి అభిమానుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ షోకి -మా ఇంటి బంగారం- చిత్ర బృందం విచ్చేసింది. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకురాలు నందిని రెడ్డితో పాటు అన్యోన్య దంపతులు సమంత, రాజ్ పాల్గొని సందడి చేశారు. సుమ మార్క్ పంచ్‌లు...బంగారం టీమ్ కాంబినేషన్‌తో ఈ ఎపిసోడ్ అంతా నవ్వుల పువ్వులు పూయించింది. ఈ ఇంటర్వ్యూలో భాగంగా సుమ అడిగిన ఆసక్తికరమైన ప్రశ్నలు, దానికి సమంత-రాజ్ జంట ఇచ్చిన సమాధానాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. --సమంత వర్సెస్ రాజ్ : ఎవరు ఉత్తమమో ఎవరికి తెలుసు?-- అనే టాస్క్‌లో భాగంగా సుమ వీరిద్దరితో పాటలు పాడించారు. అలాగే టెన్త్ క్లాస్‌లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు ఎవరికి వచ్చాయి? అని సుమ ప్రశ్నించగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా రాజ్ వైపు చూపించారు. ఇక ఏదైనా ఎమోషనల్ సీన్ చూస్తే త్వరగా ఎవరు కనెక్ట్ అయి ఏడుస్తారు? అని అడగగా.. రాజ్ వెంటనే -సమంత- వైపే చూపించారు. తాను ఏ ఏ సందర్భాల్లో అంతగా ఎమోషనల్ అవుతుందో సమంత కూడా ఈ షోలో ఓపెన్‌గా వెల్లడించారు. ఇక ఈ ఇంటర్వ్యూలో ఒక టాప్ హైలైట్ సీన్ ఏమిటంటే.. --ఏదైనా ఒక మంచి జోక్ చెప్పండి-- అని సుమ రాజ్‌ను కోరగా.. అతడు ఏమాత్రం తడుముకోకుండా -సమంత చేసిన పూరీలు చాలా బావుంటాయి- అంటూ భార్య వంట గది నైపుణ్యంపై సెటైర్ వేశాడు. రాజ్ వేసిన ఈ కౌంటర్‌తో సమంతతో పాటు యాంకర్ సుమ, దర్శకురాలు నందిని రెడ్డి కూడా నవ్వులు ఆపుకోలేకపోయారు. ఇలా ఎంతో సరదాగా, హుషారుగా సాగిన ఈ ఫుల్ ఎపిసోడ్‌ను --సుమ ౘ చాట్ షో- యూట్యూబ్ ఛానెల్స్‌లో వీక్షించవచ్చు. -మా ఇంటి బంగారం- విశేషాలు ప్రస్తుతం టాలీవుడ్‌లో -మా ఇంటి బంగారం- సినిమాకు సంబంధించిన టీజర్, పోస్టర్లు, సింగిల్స్ ఇలా ప్రతి ఒక్క ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

## చిరు కోసం 'ఫ్యామిలీ మ్యాన్'.. అసలు నిజమిదే..



ఒక కథ ఎవరిని దృష్టిలో పెట్టుకుని రాస్తారో.. చివరకు అది ఎవరి చేతుల్లోకి వెళ్ళి రికార్డులు క్రియేట్ చేస్తుందో ఎవరూ ఊహించలేరు. పాన్ ఇండియా రేంజ్ లో సంచలన విజయం సాధించిన ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ విషయంలో కూడా అలాంటి ఆసక్తికరమైన విషయం ఇప్పుడు బయటకు వచ్చింది. ఆ సిరీస్ క్రియేటర్స్ లో ఒకరైన దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. రాజ్ నిడిమోరు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఫ్యామిలీ మ్యాన్ కథను మొదట వెబ్ సిరీస్ గా కాదు, పూర్తి స్థాయి ఫీచర్ ఫిల్మ్ గా రూపొందించాలని భావించారు. అంతే కాదు, ఆ కథలోని లీడ్ రోల్ ను మెగాస్టార్ చిరంజీవిని దృష్టిలో ఉంచుకుని డెవలప్ చేశారట. మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన వ్యక్తి.. ఒకవైపు కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు సీక్రెట్ ఆపరేషన్స్ ను నిర్వహించే వ్యక్తిగా ఆ పాత్రను ఊహించుకున్నట్లు చెప్పారు. అదే సమయంలో చిరంజీవి ఖైదీ నెం.150 మూవీతో రీ ఎంట్రీ ఇచ్చి భారీ విజయాన్ని అందుకున్నారు. అలాంటి స్టేజ్ లో ఇద్దరు పిల్లల తండ్రిగా కనిపించే రోల్ ను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారన్న పెద్ద డౌట్ వచ్చినట్లు తెలుస్తోంది. కథ నచ్చినప్పటికీ, ఇమేజ్ పరంగా ఆలోచించి ముందుకు వెళ్లలేదని అప్పట్లో వినిపించిన ప్రచారానికి ఇప్పుడు రాజ్ వ్యాఖ్యలు బలం చేకూర్చాయి. కథలో మార్పులు చేయడానికి కూడా దర్శకులు సిద్ధమయ్యారట. ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ తగ్గించి, కొన్ని పాత్రల క్యారెక్టరైజేషన్ ను మార్చాలని భావించి నా చివరకు ఆ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లలేదు. దీంతో అదే ఆలోచన ను మరింత ఎలబరేట్ చేసి వెబ్ సిరీస్ రూపంలో తీసుకొచ్చారు. అలా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఫ్యామిలీ మ్యాన్ నేషనల్ వైడ్ గా మంచి రెస్పాన్స్ అందుకుంది. ఆ సిరీస్ విజయానికి ప్రధాన కారణంగా నిలిచిన అంశాల్లో ఒకటి శ్రీకాంత్ తివారీ రోల్. సాధారణ ఫ్యామిలీ పర్సన్ గా కనిపిస్తూ.. కొన్ని పరిస్థితులను ఎదుర్కొనే ఆ పాత్రలో నటుడు మనోజ్ బాజ్ పాయ్ అద్భుతంగా నటించారు. ఆ రోల్ ను ఆయన తప్ప మరెవరితోనూ ఊహించుకోలేని స్థాయిలో ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma